# సెకండ్‌హ్యాండ్

సీత అపనమ్మకంగా తండ్రిని చూసింది.

" అవునమ్మా! ఆ కండిషను పెట్టాడు అల్లుడు" చెప్పాడు పరందామయ్య.

" ఇంకోసారి చెప్పు నాన్నా!" నమ్మలేనట్లు అడిగింది.

" అవును సీత ! నువ్వు గర్భసంచీ తీయించేసుకోవాలిట!" తల్లి కనకమ్మ.

సీత కళ్ళవెంబడి కన్నీళ్ళు రాలిచెంపల మీదుగా కారి కిందపడ్డాయి.

" ఏంటమ్మా ! నువ్వు అంటున్నది!" ఎక్కి ఎక్కి ఏడుస్తూ... " నాన్నా ! రెండో పెండ్లివాడు. బావే అన్ని కండీషన్లు పెడితే మొదటి పెండ్లి దాన్ని నేను ఎన్ని పెట్టాలి! నాకేం తక్కువ! అందం తక్కువ? చదువు తక్కువా? గుణం తక్కువా?" సీత సూటి ప్రశ్న.

" కాస్త అదృష్టం తక్కువ?" చెప్పింది తల్లి.

" ఎందుకు తక్కువమ్మా ! నాకిద్దరు అన్నలున్నారు. రెండు చేతులా సంపాదిస్తున్నారు. తల్లిదండ్రులున్నారు. ఉండటానికి బంగారం లాంటి ఇల్లు ఉంది. నేను టీచరుగా పనిచేసి ట్యూషన్లు చెప్పుకుని రెండువేలు దాకా సంపాదిస్తున్నాను!" చెప్పింది.

" నీకిష్టం లేకపోతే ఈ సంబంధం వద్దుగాని నీ పెళ్ళి కాకపోతే మమ్మల్ని మటుకు తప్పు పట్టద్దు." చెప్పాడు తండ్రి.

చూడమ్మా ! ఇది జీవితం. ఓడలు బండ్లు... బండ్లు ఓడలు అవుతాయి. బావకేం తక్కువ ! పెద్ద బ్యాంకు ఆఫీసర్. రత్నాల్లాంటి ఇద్దరు పిల్లలు బోల్డు ఆస్తి ఉంది. కానీ కట్నం వద్దంటున్నాడు. ఘనంగా పెండ్లి చేస్తే చాలన్నాడు" తల్లి అడిగింది.

" అంతే ! మీకు కావాల్సింది. ఈ గుదిబండను వదిలించుకోవడమే ఇంత విషమివ్వకూడదు. తిని చస్తాను. పైగా గర్భసంచి తీయించుకోవాలా! అన్నయ్యలకు రాస్తాను" ఏడుస్తూ గదిలోకి వెళ్ళి తలుపేసుకుంది సీత.

వీళ్ళెప్పుడు అంతే ! తనకేం తక్కువయిందని కాలేజీ బ్యూటీ అని పేరు. చురుకైన పిల్ల అని అందరూ మెచ్చుకునేవాళ్లు. చదువులో ఫస్టు వచ్చింది... అయినా తన దురదృష్టమల్లా ఆ గీత తర్వాత పుట్టడమే! అయినా గీతను అనుకుని ఏం ఉపయోగం చచ్చి ఏ లోకాన ఉందో ! బావకు బుద్ధి ఉండద్దు. గీతను ప్రాణంగా ప్రేమించానంటాడు. చచ్చిపోయి ఆర్నెల్లు కాలేదు. అప్పుడే పెళ్ళికి రెడీ అయిపోయాడు. అయినా అక్క ఆబస్సు యాక్సిడెంటులో చావకపోతే తనకీ చావు తప్పేది ఛీఛీ! ఒకటో క్లాసు నుంచి అంతే! చదువులో తనకి దానికి సంవత్సరమే తేడా. దాని ప్రతి పుస్తకం భద్రంగా తన కిచ్చేవాళ్ళు.

కొత్త పుస్తకాలు కావాలని ఏడిస్తే చదువు మానెయ్యమనేవారు. బట్టలూ అంతే అదేం ఖర్మో ఎవరన్నా బంధువులు తనకూ బట్టలు పెడితే వాటిని అక్క ముందే కట్టుకునేది.

కాలేజీ చదువులో ఉండగానే బావ దాన్ని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. అతనేం కట్నం అడగకపోయినా మొదటి పెళ్ళని తెగ ఖర్చు పెట్టారు. దాని కంటే ఇంతని కట్నం ఇచ్చి ఉంటే బాగుండేది. తాను తరువాత పీజీ, బిఇడి చేసింది. దానికి నాలుగేళ్ళు పట్టింది. ఈలోగా అన్నయ్యల పెండిండ్లు... అందమైన అమ్మాయిలు దొరకడంతో కట్నం గురించి పట్టించుకోవడానికి.. వీల్లేకుండా పోయింది. పెద్దన్నయ్య ఇంజనీరు స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగం, చిన్నన్నయ్య లెక్చరర్. ఇద్దరు ఇద్దరు పిల్లలు దర్జాగా ఉన్నారు. ఎటొచ్చీ తనకకు సంబంధాలు సరిగా దొరకలేదు. వరుడు బాగుంటే అతడి చదువు తక్కువ. తీరా చదువుంటే ప్రైవేటు కంపెనీలోనో, ప్రైవేట్ కాలేజీలోనో, ప్రైవేట్ కాలేజీలోనో, టెంపరరీగా పనిచేస్తూ ఉండేవాడు ఈకాలం పర్మనెంట్ ఉద్యోగాలు లేంది ఎవరు చేసుకుంటారు. రెండూ కుదిరితే కట్నం కుదిరేదిగాదు. అప్పటికే అక్క పురుళ్ళు, పిల్లలకు, అన్నయ్య పిల్లలకు ఆర్భాటాలు వేయదానికి నాన్న రిటైర్‌మెంట్ బెనిఫిట్లు హరించుకు పోయాయి.

అన్నయ్యలు డబ్బు పంపకపోయినా తన పెళ్ళికి సాయపడతారనుకునేవాడు నాన్న.

కాని మొన్న ఒక మంచి సంబంధం ఫిక్స్ చేసుకునే ముందు వాళ్ళని అడుగుదామని ఉత్తరం రాస్తే వాళ్ళ సమాధానం నాన్నని షాక్ తినిపించింది.

" ఇల్లమ్మి పెండ్లి చెయ్యి ప్రస్తుతం మా దగ్గర అంత డబ్బు లేదు. అమ్మడం ఇష్టం లేకపోతే ఇల్లు తాకట్ట పెట్టు."

నాన్న ధైర్యం చెయ్యలేకపోయాడు. తల్లి కూడా పట్టు పట్టలేదు. తను ఎగబడి ఎలా పట్టుపడుతుంది? లోకం నవ్వదూ? తన వయసిప్పుడు 27. ఈ మధ్య తల్లిదండ్రులకు కూడా తను గుండెలమీద గ్యాస్ పొయ్యిలాగా తయారైనట్లుంది. బావ సంబంధాలు చూస్తున్నాడని తెల్సి... పోయి అడగాలా! అప్పటికే తను అంది.. " ఆయనంత సిగ్గులేకుండా పెండ్లి చేసుకుంటానంటే చేసుకోనీ... మనమేం చేస్తాం" అని.

" పిల్లలు ఏమవుతారే! సవతితల్లి చూస్తుందా!" తల్లి కనకమ్మ బాధపడింది.

" అందుకే పెళ్లి చేసుకోకూడదు" అంది.

" పిచ్చి మొహమా! అల్లుడు పెండ్లి చేసుకునేది పిల్లలకోసమేనే! తాను ఆఫీసుకు వెళితే వాళ్ల ఆలనాపాలనా ఎవరు చూస్తారు?" తండ్రి ప్రశ్న.

" నీకు తెలుసా ! ఇప్పుడు అల్లుడులాంటి వాడికి ఐదు లక్షలు కట్నం ఇవ్వాల్సి వస్తుంది" తల్లి లోకజ్ఞానాన్ని బయట పెట్టింది.

" అది మొదటి పెండ్లివాడి విషయంలో, ఇప్పుడు బావే ఇవ్వాల్సివస్తుంది" తను హాస్యంగా అంది అక్కసు వెళ్ళగక్కుతూ.

" నీమొహం! అల్లుడు మంచివాడు కాబట్టి ఇన్నాళ్లు ఆగాడు" తల్లి గదమాయింపు.

" మొన్న పెళ్ళిళ్ళ పేరయ్య... ఏవండీ మీ అల్లుడు సంబంధాలు వెతుకుతున్నాడట, పరాయివాళ్ళు పిల్లల సరిగా చూసుకుంటారో చూసుకోరో ! మీరే పిల్లనిస్తే ఆ సమస్య ఉండదుకదా అన్నాడు... తండ్రి పరంధామయ్య సెలవిచ్చాడు సీతను చూస్తూ.

తనకు తేళ్లు, జెర్రులు పాకినట్లఘుంది. చిన్నప్పటి నుండి అక్కధర్మమాని సెకండ్ హ్యాండు బ్రతుకు బ్రతికింది. ఇప్పుడు...!

మర్నాడు బావ... సుబ్బారావు వచ్చాడు పిల్లల్ని తీసుకుని. భోజనాల తర్వాత సీత చెయ్యిపట్టుకున్నాడు కూర్చో అంటూ.

" బావా ! చెయ్యివదులు!" కఠినంగా అంది.

" ఏం ?" బావ అడిగాడు విస్మయంగా.

" నువ్వు నా మెల్లో తాళికట్టిన మొగుడివా చెయ్యి పట్టుకోవడానికి? " కోపంగా అంది.

" ఆ ! తాళి కట్టడానికేగా వచ్చింది!" ఓరగా చూస్తూ చెప్పాడు సుబ్బారావు.

" నువ్వు కడతానన్నా ఇక్కడ కట్టించుకోవడానికి ఎవరూ రెడీగా లేరు" చెప్పింది గట్టిగా.

" అత్తమామ అలా చెప్పారేం! మామయ్యా !" కేక పెట్టాడు.

" ఏమైంది అల్లుడుగారు" పరంధామయ్య వచ్చాడు. ఆ వెనుక కనకమ్మ చీర కొంగు చుట్టుకుంటూ వచ్చింది.

" బుజ్జిగాడ్ని, నానిని ఇక్కడ వదిలేసి వెళదామనుకుంటున్నాను" చెప్పాడు.

" అదేంటి నాయనా! అలా అంటావు !" షాకైంది కనకమ్మ.

" ఏం చెయ్యమంటారు ! నాకు పిల్లల్ని పెంచడం చేతకాదు. వీళ్ళకోసం వేరేపెళ్ళి చేసుకుందామనుకున్నా ! కాని పిల్లలు గలవాడికి ఎవరూ పిల్లనివ్వడానికి ముందుకు రావడం లేదు. కర్మకాలి వచ్చినా వీళ్లను హాస్టల్లో చేర్పించండి అని చెబుతున్నారు. అందుకని మీ మనవండ్లను మీరే సాక్కోండి" సుబ్బారావు నిర్లిప్తంగా చెప్పాడు.

" ఏం తండ్రివి బావా. పిల్లల్ని పెంచడం నీ బాధ్యత కాదా. ఒక వేళ యాక్సిడెంటులో అక్క కాక నువ్వు పోయిఉంటే... అక్కా ఇలా పిల్లల్ని దిక్కులేని వాళ్లని చేసి వేరే పెళ్ళి చేసుకునేదా?" సీత కోపంగా అడిగింది.

" ఒసే నోర్మూసుకో ! నువ్వు బావను చేసుకుంటే ఈ సమస్యలే వుండవు!"

పరంధామయ్య కోపంగా చెప్పాడు.

" పిల్లలకు నీ దగ్గర చనువు వుంది. అదృష్టం అవుతావని ముందుకొచ్చాడు. నాకు పిల్లదొరక్క కాదు. కట్నాలతో రెడీగా ఉన్నారు. గీత మీదున్న ప్రేమతో నిన్ను కట్నం లేకుండా చేసుకుందామనుకుంటే నీకు కళ్ళు నెత్తిమీదకొచ్చాయి." బావ దులిపేశాడు.

" సరే మీరు ఫైనల్‌గా ఆలోచించుకుని ఓ వారంలోగా తెలియచెయ్యండి. పిల్లల్ని వదిలి వెళుతున్నాను. వారం దాటితే నేను వేరే సంబంధం ఖాయం చేసుకుంటాను" చెప్పాడు సుబ్బారావు. పదహారేళ్ల శ్వేత నిశ్చేష్టురాలై వింటున్నది ఈ భాగోతాన్ని. ఆమె ఆలస్యంగా పుట్టి బ్రతికిపోయింది.

సుబ్బారావు వెళ్లిపోయిన తర్వాత తల్లిదండ్రులు నానాయాగీ చేశారు.

" దరిద్రం మొహమా ! నీకింతకంటే మంచి సంబంధం వస్తుందిటే ! అక్క పెండ్లి అప్పులే ఇంకా తీరలేదు. మళ్లీ నీ మొహాన అప్పుచేస్తే నీ చెల్లెలు శ్వేతకు ఎలా చెయ్యాలే పెళ్లి."

సీత బాధపడుతూ అన్నయ్యలిద్దరికీ పెద్ద పొదుగున రాసింది స్కూల్లో కూర్చుని.

మూడో రోజుకు జవాబులు వచ్చి వాలాయి. సారాంశం... పెద్దన్నయ్య పరిస్థితి ఇప్పుడంత బాగాలేదట. మామూళ్లు మునుపటిలా రావడం లేదట. వదిన ఆరోగ్యం బాగా లేదట. ఏతావాతా జీతం సరిపోవడం లేదట. కాబట్టి బావను చేసుకోవడం అన్ని విధాలా శ్రేయస్కరం. గర్భసంచీ విషయం పెళ్ళయిన తర్వాత ఆటోమేటిక్‌గా సర్దుకు పోతాడని, ఇక రెండో అన్నయ్యకు జీతాలు సరిగా ఇవ్వడం లేదట. గ్రాంటు వచ్చినప్పుడే ఇస్తారట. రెండు మూడు నెలల జీతాలు లేకుండా నెగ్గుకురావాలిట. ఇప్పుడే ఇల్లు మొదలెట్టాడట. ఎల్ఐసీలో అప్పు తీసుకున్నాడట. అటు ప్రీమియం, ఇటు అసలు, వడ్డీ కట్టేసరికి తలప్రాణం తోకకొస్తోందట. నచ్చితే బావని చేసుకో. ఈ కాలంలో పెళ్ళి కంపల్సరీకాదు. కాబట్టి దిగులు పడవద్దు అని రాశాడు.

ఆ ఉత్తరాలు చూసి ఏడ్చింది. తన ఏడుపు చూసి ఆ ఉత్తరాలు చదివి తల్లీ తండ్రి కూడా ఏడుపు కొనసాగించారు. ఆరాత్రి...

" ఒసే ! సీతా ! నువ్వు బావను చేసుకుంటావా? చేసుకోవా?" తల్లి.

" అమ్మా, సీతా ! బావని చేసుకోమ్మా !" తండ్రి అర్థింపు.

" ఎన్నిసార్లు చెప్పాలమ్మా నాకిష్టం లేదని. మీకంత బరువైతే చెప్పండి, ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటాను" సీత ఏడ్చింది.

పరంధామయ్య లోపలకు వెళ్లి ఓ సీసా తెచ్చి " సీతా ! నువ్వు ఒప్పుకున్నావా సరి, లేకపోతే మీ అమ్మ, నేనూ ఈ పురుగుల మందు తాగి చస్తాం! కూతురికి పెళ్లి

చేయలేక పోయారన్న అపనింద కంటే చావడమే మేలు మాకు!"

" సీతా ! మీ నాన్న పట్టుదల తెలుసుగా నాకూ బతుకుమీద విరక్తి పుట్టింది. అటు చూస్తే చంటి వెధవలు, ఇటు చూస్తే మునగచెట్టులా నువ్వు !" తల్లి కళ్లెంట నీళ్లు.

సరిగ్గా అప్పుడు సీతకు జీవితం మీద విరక్తి పుట్టింది. " అమ్మా ! నాకోసం మీరెందుకమ్మా చస్తారు. నా చావేదో నేనే చస్తాను. కానివ్వండి!" ఏడుస్తూ చెప్పింది.

అంతే ! నెలకల్లా పెళ్లి సింపులుగా జరిగిపోయింది. బంధువులు పెద్దగా రాలేదు. తాను స్నేహితురాండ్రను పిలవలేదు. శోభనం రోజు తెల్లటి పట్టుచీర... అదీ అక్కదే! మళ్లీ వేలు పోసి ఎందుకు కొనాలని అదే కట్టారు. పాలగ్లాసుతో గదిలోకి వెళ్లిన సీత భుజంమీద చేయివేసి దగ్గరకు తీసుకుంటూనే... " ఈ చీరలో గీత ఎంత అందంగా ఉండేదనుకున్నావు. నీకా అందం రాలేదు. ఈ రోజు అనుభవాన్నీ, ఆమెని మరవడం కష్టం" అన్నాడు బావ లోపల ఆనందంగా ఉన్నా, బాధను నటిస్తున్నట్టు తెలుస్తూనే ఉంది.

" బావా ! రేపే గర్భసంచీ తీయించెయ్యి. మనకు పిల్లలు పుట్టకూడదు!" ఏడుస్తూ ముందనుకున్న పాఠం చెప్పింది.

" సీతా ! నీ త్యాగం గొప్పది. మీ అక్క చాలా సంతోషపడుతుంది" ఆనందంగా చెప్పాడు సీతకు సెకండ్‌హ్యాండ్ మొగుడిపై పూర్తి విరక్తి కలిగింది ఆ క్షణంలోనే.

– ఆంధ్రప్రభ 25.11.2007